సాక్షి ఖమ్మం

శనివారం, 10, ఆగస్టు, 2024



ఖజానా కళకళలాడేలా...

ఆర్టీసీ ఆదాయం పెంచుకునేందుకు బస్సులను డిపాజిట్ లేకుండా అద్దెకు ఇచ్చేలా ప్రణాళిక రూపొందించింది. 8లో



నాటక రంగానికి ఊపిరి

నాటక రంగానికి ఊపిరి పోసేలా ప్రదర్శనలు ఇవ్వడమే కాక పోటీలు నిర్వహించడం అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. 8లో

గరిష్టం / కనిష్టం 33°/24°

వాతావరణం

జిల్లాలో శనివారం కొన్నిచోట్ల వర్షం కురిసే అవకాశముంది. మిగతా చోట్ల సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి.

న్యూస్‌రీల్

డయల్ 100కు 2,531 ఫోన్లు

ఖమ్మంక్రైం: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేలా సత్వరమే స్పందించేందుకు ఏర్పాటైన డయల్ 100కు జూలై నెలలో 2,531 మంది ఫోన్ చేశారని సీపీ సునీల్‌దత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో 78 ఫోన్లకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయగా.. మహిళలపై వేధింపులు, చోరీలు, ప్రమాదాలు, అనుమానాస్పద మరణాలు ఉన్నాయని వెల్లడించారు. అయితే, కొందరు అవగాహన లేకుండా ఫిర్యాదు చేస్తున్నారని.. అత్యవసర సమయాల్లో మాత్రమే డయల్ 100కు ఫోన్ చేయాలని సీపీ సూచించారు.

ఉద్యోగాలకు 15మంది ఎంపిక



మాట్లాడుతున్న డీఐఈఓ రవిబాబు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో హెచ్‌సీఎల్ సంస్థ ఆధ్వర్యాన శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించగా 15మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు తెలిపారు. జాబ్‌మేళాను పర్యవేక్షించిన ఆయన మాట్లాడుతూ 100మంది విద్యార్థులు హాజరు కాగా వీరిలో 15మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వీరు డిగ్రీ చదువుతుండగానే రెండేళ్ల పాటు శిక్షణ ఇచ్చి హెచ్‌సీఎల్‌లో ఉద్యోగాల్లోకి తీసుకుంటారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్.రామారావు, ఏఎస్ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరావు, హెచ్‌సీఎల్ ప్రతినిధులు అంకిత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులంతా పాలుపంచుకోవాలి



బహుమతులు అందజేస్తున్న ఎఫ్ఆర్ఓ

చింతకాని: స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో విద్యార్థులు పాలుపంచుకుంటే మెరుగైన ఫలితాలు వస్తాయని ఖమ్మం ఎఫ్ఆర్ఓ బెల్లం రాధిక వెల్లడించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పారిశుద్ధ్య లోపం ఏర్పకుండా తీసుకోవాలిన్న జాగ్రత్తలపై కుటుంబీకులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ కవిత, ఎఫ్‌బీఓ జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీకి భూమి కేటాయింపు

స్వామి నారాయణ్ గురుకులానికి కూడా..

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీతోపాటు స్వామి నారాయణ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు ప్రభుత్వ భూమి కేటాయిస్తూ శుక్రవారం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ జీఓ జారీ చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలకు ఖమ్మం అర్బన్ మండలం బల్లేపల్లిలోని సర్వే నంబర్ 137లో 17.26ఎకరాలు, రఘునాథపాలెంలోని సర్వే నంబర్ 218లో 17.20 ఎకరాలను కేటాయించారు. ఇక రఘునాథపాలెంలో స్వామి నారాయణ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు వివిధ సర్వే నంబర్లలోని 13.10 ఎకరాల భూమిని ప్రభుత్వ ధరతో కేటాయిస్తూ నవీన్‌మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు.



నాగేంద్రుడికి పాలు పోస్తున్న భక్తులు

నాగేంద్రా.. దీవించయ్యా

శ్రావణమాసంలో వచ్చే నాగుల పంచమి పర్వదినాన్ని జిల్లాలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయమే పుట్టల వద్దకు చేరుకున్న భక్తులు నాగేంద్రుడికి పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చాలని నాగేంద్రుడిని వేడుకున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్



నాగేంద్రుడికి పాలు పోస్తున్న దంపతులు



నుదుటన పుట్ట మన్ను పెట్టుకుంటున్న భక్తురాలు

రైతుల రుణవిముక్తే మా లక్ష్యం

ఈనెల 15న వైరాలో రూ.2లక్షల రుణమాఫీ

- అదేరోజు సీతారామ ప్రాజెక్టు ప్రారంభం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

వైరా/వైరా రూరల్: రాష్ట్రంలో రైతులందరినీ రుణ విముక్తులను చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని.. అందులో భాగంగానే మొదటి, రెండు విడతల్లో 16.29 లక్షల కుటుంబాలకు రూ.1.50లక్షల లోపు రుణాలు మాఫీ చేశామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈనెల 15న వైరాలో జరిగే సభలో రూ.2 లక్షల మేర రుణమాఫీ లబ్ధిదారులకు సీఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా చెక్కులు అందిస్తారని తెలిపారు. అదేరోజు సీతారామ ప్రాజెక్టు ద్వారా నీరు విడుదల చేస్తారని చెప్పారు. వైరాతో పాటు వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి భట్టి శుక్రవారం శంకుస్థాపన చేశారు. వైరాలో రూ.26.87 కోట్లతో చేపట్టే అమృత్ 2.0 పనులు, రూ.42.10కోట్లతో చేయనున్న వైరా రిజర్వాయర్ ఆధునీకీకరణ రెండో దశ పనులు, రూ.37.50 కోట్లతో నిర్మించే 100 పడకల ఆస్పత్రి భవనంతో పాటు స్నానాల లక్ష్మీపురం గ్రామంలో శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశాక భట్టి మాట్లాడారు.

పండుగ రోజు...

ప్రతిపక్ష నాయకులు చాలెంజ్ విసిరినా.. సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్థిక మంత్రిగా తాను రుణమాఫీని సంపూర్ణం చేయనుండడంతో రైతులందరికీ ఆగస్టు 15 పండుగ రోజుగా మారనుందని భట్టి తెలిపారు. అలాగే, గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన డ్రిప్, పంటల యాంత్రీకరణ పథకాలను పునరుద్ధరిస్తున్నామన్నారు. జిల్లాలోని రాజీవ్, ఇందిరాసాగర్ ప్రాజెక్టులను రీడిజైనింగ్ పేరుతో రూ.1,450 కోట్ల నుంచి రూ.రూ.23 వేల కోట్లకు అంచనాలను పెంచిన బీఆర్ఎస్ ప్రభుత్వం దోపిడీకి పాల్పడిందని విమర్శించారు. దీనికి తోడు ఎకరానికీ నీరు ఇవ్వలేదని.. తాము అధికారంలోకి రాగానే రూ.75 కోట్లతోనే 1.5 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వనున్నామని భట్టి తెలిపారు. అలాగే, వైరాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరడంతో భట్టి పరిశీలించి మరమ్మతు, నిర్మాణ ప్రతిపాదనలు పంపించాలని డీఐఈఓ రవిబాబు, ప్రిన్సిపాల్ నవీనజ్యోతికి సూచించారు. కాగా, భట్టి స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఆతర్వాత జాతీయ రహదారిపై అండర్ పాస్‌ల నిర్మాణంపై అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు నాయుడు సత్యానారాయణ, రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, డీఆర్డీఓ సన్యాసయ్య, డీఎంహెచ్ఓ మాలతి, ఇరిగేషన్ సీఈ విద్యాసాగర్, ఎస్ఈ నర్సింగరావు, మున్సిపల్ కమిషనర్ చింతల వేణు, వివిధ శాఖల ఉద్యోగులు బాబూరావు, నవీన్, ఏ.సులోచన, నాయకులు, ప్రజాప్రతినిధులు బొర్రా రాజశేఖర్, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ముళ్లపాటి సీతారాములు, కట్ల రంగారావు, శీలం వెంకటనర్సిరెడ్డి, దాసరి దానియేలు, ఏదునూరి సీతారాములు, పమ్మి అశోక్, దార్నా రాజశేఖర్, మిట్టపల్లి నాగి, బానోతు బాలాజీ, దొడ్డా పుల్లయ్య, మల్లు రామకృష్ణ, మట్లూరి కృష్ణారావు, మచ్చా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



వైరాలో అమృత్ పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి, పక్కన ఎమ్మెల్యే రాందాస్ తదితరులు



మొక్క నాటి నీళ్లు పోస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

పాలేరు టు పర్ణశాల

- పర్యాటక అభివృద్ధికి మంత్రి తుమ్మల ప్రతిపాదనలు
- పర్యాటక శాఖ మంత్రి జూపల్లితో భేటీ



మంత్రి జూపల్లితో మాట్లాడుతున్న తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం జిల్లాలోని పాలేరు నుంచి భద్రాద్రి జిల్లాలోని పర్ణశాల వరకు పర్యాటక అభివృద్ధి అవకాశమున్నందున నిధులు మంజూరు చేయాలని పర్యాటక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావును వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. హైదరాబాద్‌లో జూపల్లిని కలిసిన తుమ్మల ఈనెల 12న ఖమ్మం వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. పాలేరు రిజర్వాయర్ జాతీయ రహదారికి సమీపాన ఉండడం.. పక్కనే దేశంలోనే రెండో అతిపెద్ద శివలింగం కొలువైన కూసుమంచి శివాలయం ఉందని తెలిపారు. అంతేకాక దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన నేలకొండపల్లి బౌద్ధస్థూపం, భక్తరామదాసు ధ్యాన మందిరం ఉండగా.. ఖమ్మం ఖిల్లాపై రోప్‌వే, లకారం ట్యాంక్ బండ్, వెలుగుమట్ల అర్బన్ పార్క్, వైరా రిజర్వాయర్, కిన్నెరసాని ప్రాజెక్టు, భద్రాచలం కరకట్ట వద్ద పర్యాటకంగా అభివృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయని చెప్పారు. వీటికి తోడు భద్రాచలం రామాలయం, సింగరేణి గనులు, కేటీపీఎస్, భార జల కర్మాగారాలు ఉన్నందున వినోదంతో పాటు విజ్ఞానం పెంచొచ్చని మంత్రి తుమ్మల వివరించారు. దీంతో ఈనెల 12న క్షేత్రస్థాయి పరిశీలనకు రానున్న మంత్రి జూపల్లి చెప్పారని వెల్లడించారు.

11న మంత్రి ఉత్తమ్ పర్యటన

రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి 11వ తేదీన జిల్లాలో పర్యటిస్తారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద సీతారామ ప్రాజెక్ట్ పంప్ హౌస్–2, కమలాపురం వద్ద పంప్ హౌస్–3 ట్రయల్ రన్‌కు ఆయన శంకుస్థాపన చేయడంతో పాటు పంప్ హౌస్ వద్ద నుండి వైరా లింక్ కెనాల్ వరకు ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలిస్తారని పేర్కొన్నారు. అలాగే, వైరాలో సీఎం రేవంత్‌రెడ్డి సభకు జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించనున్నట్లు మంత్రి తెలిపారు.

1.75 లక్షల ఎకరాలకు సాగు



ఏన్కూరులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- త్వరలోనే తెల్ల రేషన్‌కార్డులు, ఇళ్లు
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఏన్కూరు: సీతారామ ప్రాజెక్ట్ ద్వారా 1.75 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార హౌసింగ్ పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సీతారామ ప్రాజెక్ట్ లింక్ కెనాల్ పనులను శుక్రవారం ఆయన ఏన్కూరు వద్ద పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూపకల్పన చేసిన రాజీవ్ సాగర్, ఇందిరాసాగర్ ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం రీడిజైన్ పేరుతో సీతారామ ప్రాజెక్ట్‌గా మార్చి అంచనాలు పెంచినా పనులు పూర్తిచేయలేదని మండిపడ్డారు. కానీ తాము అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే ప్రాజెక్ట్ పనులు పూర్తిచేసి ఈనెల 15న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సాగునీరు విడుదల చేయనున్నామని తెలిపారు. అదేరోజు రూ.2లక్షల రుణమాఫీని సైతం ప్రారంభిస్తారని వివరించారు. కాగా, త్వరలోనే అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. ఇకనుంచి ఆరోగ్యశ్రీ, తెల్ల రేషన్ కార్డులు విడివిడిగా ఇస్తామని వెల్లడించారు. అంతేకాక ధరణితో రైతుల సమస్యలు తీర్చేందుకు రెవెన్యూ చట్టంలో మార్పులు తీసుకొస్తున్నామని పొంగులేటి చెప్పారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్, కల్లూరు ఆర్డీఓ రాజేందర్ పాల్గొన్నారు.

బోధనా పద్ధతుల్లో మార్పుతో మేలు

జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ



కొణిజర్లలో పాఠం బోధిస్తున్న డీఈఓ శర్మ

కొణిజర్ల: ఉపాధ్యాయులు బోధనా పద్ధతులు మార్చుకుని పాఠశాలలో అనువైన వాతావరణాన్ని కల్పిస్తే మంచి ఫలితాలు వస్తాయని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. కొణిజర్లలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఎన్ఏఎస్(నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే)పై ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు ఎప్పుడైతే ధారాళంగా చదివి అర్థం చేసుకోగలుగుతారో అప్పుడే వారి సామర్థ్యాలు పెరుగుతాయని తెలిపారు. కాగా, విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో ఎందుక చేరడం లేదో తెలుసుకుని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆర్వాత పాఠశాల 6వ తరగతి విద్యార్థులకు డీఈఓ సైన్స్ పాఠం బోధించి వారి సామర్థ్యాలను పరిశీలించారు.

ఇంగ్లిష్ మీడియంలో చేరేలా చూడండి

చింతకాని: విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో చేరేలా అవగాహన కల్పించాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. చింతకాని ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణను పరిశీలించి మాట్లాడారు. ఉపాధ్యాయులు తరగతి గదిలో ఆంగ్లంలోనే మాట్లాడడం ద్వారా విద్యార్థులకూ ఆసక్తి పెరుగుతుందన్నారు. అలాగే, పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత నమోదయ్యేలా ఇప్పటినుంచే శ్రద్ధ వహించాలని తెలిపారు. అనంతరం నేరడ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ఈకార్యక్రమాల్లో ఏఎంఓ రవికుమార్ ఎంఈఓ మోదుగు శ్యాంసన్, నోడల్ ఆఫీసర్లు కె.అబ్రహం, వీరపునేని శ్రీనివాసరావు, క్లస్టర్ హెచ్‌ఎంలు శాంత కుమారి, శ్రీనివాసరావుతో పాటు రమేష్, సైదా, రత్నకుమార్, జయరాజు, వెంకటేశ్వరశర్మ, కనపర్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా సాంబరాజు



సాంబరాజు

ఖమ్మంక్రైం: ఖమ్మం స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా యు.సాంబరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సీసీఆర్బీ ఏసీపీగా ఉన్న ఆయనను ఎస్బీకి కేటాయిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బాధ్యతలు స్వీకరించిన ఆయన సీపీ సునీల్‌దత్‌ను కలిశారు. 1996 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన సాంబరాజు ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ఎస్ఐ, సీఐగా విధులు నిర్వర్తించారు.

'భద్రాచలం – మల్కాన్‌గిరి'కి గ్రీన్ సిగ్నల్

- రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్రప్రభుత్వ ఆమోదం
- ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రకటన

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని భద్రాద్రి జిల్లా వాసులకు కేంద్రం శుభవార్త ప్రకటించింది. భద్రాచలం మీదుగా వెళ్లే రైలుమార్గం నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఆది వాసీ దినోత్సవం సందర్భంగా పూర్వోదయ యాక్ష న్ ప్లాన్‌లో భాగంగా గిరిజన ప్రాంతాల మీదుగా ఎనిమిది రైల్వేలైన్ల నిర్మాణానికి ప్రధాని మోదీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేబినెట్‌లో ఆమోదించారు. ఇందులో మల్కాన్‌గిరి నుంచి భద్రాచలం మీదుగా పాండురంగాపురం వరకు 173 కి.మీ. లైన్ కూడా ఉందని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు.

అసన్‌సోల్ టూ వరంగల్

పూర్వోదయ పథకంలో భాగంగా ప్రకటించిన రైల్వే లైన్లలో ఒడిశా మీదుగా వెళ్లే మూడు ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే తూర్పు తీరంలో మరో ప్రధాన రైలు మార్గం అందుబాటులోకి వచ్చినట్లవుతుంది. ప్రస్తుతం అసన్‌సోల్ – హౌరా (కోల్‌కతా) – విశాఖపట్నం – విజయవాడ – కాజీపేట మార్గం కీలకంగా ఉంది. దీనికి ప్రత్యామ్నాయంగా మల్కాన్‌గిరి – భద్రాచలం – పాండురంగాపురం రైల్వేలైన్ అందుబాటులో వస్తుంది. అప్పుడు పశ్చిమబెంగాల్‌లోని అసన్‌సోల్ నుంచి వరంగల్ వరకు రెండో మార్గం ఏర్పడి... తూర్పు తీరప్రాంతం నుంచి దక్షిణ, మధ్య, పశ్చిమ ప్రాంతాలకు కనెక్టివిటీ పెరుగుతుంది. తుపాన్లు, భారీ వర్షాల కారణంగా సమస్య తలెత్తినా రవాణాపరంగా ఇబ్బందులు ఉండవు.

అభివృద్ధికి ఊతం

మల్కాన్‌గిరి – పాండురంగాపురం రైల్వే లైన్ నిర్మాణం జరిగితే ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఏపీలోని అల్లూరి జిల్లా, భద్రాద్రి జిల్లాలకు కనెక్టివిటీ పెరుగుతుంది. గిరిజన జనాభా అధికంగా ఉన్న ఈ ప్రాంతాల్లో ఆర్థిక, పర్యాటక, ఉపాధి, ఖనిజాల రవాణా, విద్యుత్ రంగాల్లో అభివృద్ధి పట్టాలెక్కుతుందని కేంద్రం భావిస్తోంది. మల్కాన్‌గిరి(జునాగఢ్) నుంచి పాండురంగాపురం వరకు మొత్తం 173 కి.మీ నిడివితో నిర్మించే ఈ మార్గానికి రూ.3,592 కోట్లు ఖర్చవుతుందని ఇప్పటికే తేల్చారు..

అనూహ్యంగా

ఎన్డీఏ–2 హయాంలో మల్కాన్‌గిరి – భద్రాచలం – పాండురంగాపురం రైల్వే లైన్ తెర మీదకు వచ్చింది. ఆపై 2023 సెప్టెంబర్‌లో ఫైనల్ లోకేషన్ సర్వే కూడా పూర్తయింది. ఈ ఏడా ది బడ్జెట్లలో ప్రకటన ఉంటుందని భావించినా అలా జరగకపోవడంతో మిగిలిన మార్గాల తరహాలోనే ఇది కూడా పెండింగ్ పడినట్లేననే అభిప్రాయం వ్యక్తమైంది. ఇంతలోనే కేంద్ర కేబినెట్ ఆమో దం తెలపడం విశేషం.

రైల్వే మంత్రి పట్టుదల

రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ ఒడిశా వాసి కావడంతో భద్రాచలం – మల్కాన్‌గిరి మార్గానికి అనుకూలత ఏర్పడిందని చెబుతున్నారు. అయితే, గిరిజన ప్రాంతాలను కలిపే మణుగూరు – కిరండోల్ (ఛత్తీస్‌గఢ్), మణుగూరు – రామగుండం రైల్వేలైన్ల విషయంలో కేంద్రం నుంచి సానుకూల ప్రకటన రాకపోవడం కొంత నిరాశ కలిగించింది.

చుక్క కూడా చేజారకుండా...

- కేఎంసీ పరిధిలో నల్లా కనెక్షన్లకు మీటర్లు
- నీటిని పొదుపు చేయడమే లక్ష్యం
- పైలట్ ప్రాజెక్టుగా అల్లీపురం ఎంపిక

ఖమ్మంమయూరిసెంటర్: తాగునీరు నీరు వృథా కాకుండా చూసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గృహావసరాలకు ఇచ్చిన నల్లా కనెక్షన్ల ద్వారా వినియోగానికి మించి నీటి సరఫరా జరుగుతుండగా.. చాలా చోట్ల వృథా అవుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. దీంతో దీన్ని అరికట్టేలా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నల్లాలకు మీటర్లు ఏర్పాటుచేయాలని కేఎంసీ అధికారులు నిర్ణయించారు. తద్వారా 24 గంటల పాటు తాగునీరు సరఫరా చేసినా అవసరం మేరకే వాడుకుంటారని అంచనా వేస్తున్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 73 వేల కనెక్షన్లు ఉండగా, డివిజన్ల వారీగా అన్నిచోట్ల మీటర్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

అల్లీపురం నుంచి మొదలు

మీటర్లు బిగించేందుకు నగరంలోని 15వ డివిజన్ అల్లీపురంను పైలట్ ప్రాజెక్టు ఎంపిక చేశారు. ఇక్కడ కార్పొరేటర్, ప్రజల ఆమోదం మేరకు పబ్లిక్ హెల్త్ అధికారులు ఇళ్లలోని నల్లాలకు మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో 400 కనెక్షన్ల వరకు ఉన్నాయి. కాగా, మీటర్లు పెడితే బిల్లు పెంచుతారనే అనుమానాలు వ్యక్తం చేస్తుండగా..ప్రభుత్వానికి అలాంటి ఆలోచన లేదని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.



నల్లాకు మీటర్ బిగిస్తున్న సిబ్బంది

అన్ని కనెక్షన్లకు మీటర్లు..



దశలవారీగా నగరంలోని అన్ని నల్లా కనెక్షన్లకు మీటర్లు ఏర్పాటు చేస్తాం. కేంద్రప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ తప్పనిసరి. అల్లీపురంలో మీటర్ల ఏర్పాటు చివరి దశకు చేరింది. ఆతర్వాత 14వ డివిజన్‌లో మీటర్ల బిగింపుపై సమాలోచనలు చేస్తున్నాం. వీటి ద్వారా నీరు ఎక్కడా వృథా కాదు.

– వి.రంజిత్, ఈఈ, పబ్లిక్ హెల్త్

అవసరానికి మించి సరఫరా

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నల్లా కనెక్షన్ కలిగిన ప్రతీ ఇంట్లో మనిషికి 150 లీటర్ల చొప్పున నీరు సరఫరా చేస్తున్నారు. అయితే, చాలాచోట్ల సంప్‌లు నిండినా ఆఫ్ చేయకపోవడంతో నీరు వృథా అవుతోంది. ఖమ్మంలోని పలు కాలనీల్లో రహదారులపైకి తాగు నీరు పారుతున్నా కొందరు యజమానులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఈనేపథ్యాన కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నల్లాలకు మీటర్లు ఏర్పాటుచేస్తుండడంతో ఎప్పటికప్పుడు లెక్కలు నమోదవుతాయి. తద్వారా అవసరం మేరకు నీటిని పట్టుకుని ఆ తర్వాత ఆఫ్ చేస్తారనే భావన వ్యక్తమవుతోంది. సాధారణంగా రోజూ మనిషికి 90 లీటర్ల మేర నీటి అవసరం ఉండగా.. ప్రస్తుతం 150లీటర్లు సరఫరా అవుతోంది. ఫలితంగా ఎక్కువ మంది ట్యాప్‌లను ఆఫ్ చేయకపోవడంతో వృథా అవుతోందని అంచనా వేస్తున్నారు. దీనిలో భాగంగా డివిజన్ల వారీగా స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల ఆమోదం మేరకు మీటర్లు బిగించేందుకు ఏర్పాటు చేస్తున్నారు.

క్లుప్తంగా

రామయ్య సేవలో ఖమ్మం జిల్లా జడ్జి



భద్రాచలంలో జడ్జికి ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఉద్యోగి

భద్రాచలంటౌన్/పాల్వంచరూరల్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారిని ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు అధికారులు ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు. అలాగే, పాల్వంచ మండలంలో కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) అమ్మవారిని కూడా జిల్లా జడ్జి రాజగోపాల్ దర్శించుకుని పూజలు చేశారు. కాగా, పెద్దమ్మతల్లి అమ్మవారిని పాల్వంచ పట్టణ ఎస్‌ఐ సుమన్ సైతం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఇద్దరి ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నివారణ కమిటీ, ఎన్‌ఎస్‌ఎస్ సంయుక్త ఆధ్వర్యాన శుక్రవారం ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో 5కే రన్ పోటీలు నిర్వహించారు. ముప్పై మందికి పైగా అథ్లెట్లు పాల్గొనగా ప్రథమ స్థానాల్లో నిలిచిన బాలుర నుంచి కె.నాగరాజు(యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యూకేషన్ కళాశాల, ఖమ్మం), ఎస్.కే.సమ్రీన్ (ఖమ్మం)ను ఈనెల 12న జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ కన్వీనర్ ఎస్.శ్రీనివాసరావు, ఎయిడ్స్ ప్రోగ్రాం మేనేజర్ డి.సత్యకుమార్, కోచ్‌లు ఎం.డీ.గౌస్, ఎం.డీ.అక్బర్, ఏ.శంకర్, కొండల్‌రావు, ఎల్.రమణ, జి.రాంకుమారస్వామి, శ్రీనివాసులు, చెంచు రత్నయ్య పాల్గొన్నారు.

విద్యుత్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఎన్నిక



ఎన్నిక నిర్వహిస్తున్న ఎస్‌ఈ సురేందర్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం విద్యుత్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఎన్నిక శుక్రవారం రాత్రి సర్కిల్ కార్యాలయంలో జరిగింది. ఈమేరకు కౌన్సిల్ చైర్మన్‌గా ఎస్‌ఈ సురేందర్, కన్వీనర్లుగా డీఈ బాబూరావు, అకౌంట్స్ అధికారి సీతారాం గోపాల్‌తో పాటు సభ్యులుగా జయప్రకాష్, ఆర్‌ఎస్. రాజు, బి.రామకృష్ణ ఎన్నికయ్యారు. అలాగే, క్రీడల వారీగా వివేక్, నాగేందర్, ఎస్.షణ్ముఖాచారి, ఉపేందర్, వెంకటేశ్వరరావు, ఇమామ్, లావణ్య, యాసిన్, రమేష్, లిఖిత, శేఖర్‌బాబుతో పాటు కల్చరల్ కార్యదర్శిగా ఎం.ప్రసాద్‌ను ఎన్నుకున్నారు.

ఖమ్మంలో హెరాయిన్ కలకలం

ఖమ్మంక్రైం: మాదక ద్రవ్యాల్లో అత్యంత ప్రమాదకారిగా భావించే హెరాయిన్ ఖమ్మంలో పట్టుబడటం కలకలం రేకెత్తించింది. ఖమ్మంకు చెందిన ఓ యువకుడి వద్ద హెరాయిన్ ఉందనే సమాచారం మేరకు శుక్రవారం హైదరాబాద్, వరంగల్ నుండి వచ్చిన నార్కోటిక్ బృందం ఖమ్మం టూటౌన్ పోలీసులతో కలిసి తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా సదరు యువకుడి వద్ద రెండున్నర గ్రాములకు పైగా హెరాయిన్ లభ్యమైనట్లు సమాచారం. అయితే ఈ వ్యవహారాన్ని పోలీసులు బయటకు వెల్లడించకపోగా.. ఎక్కడ నుండి తీసుకొచ్చారు, ఎవరికైనా సరఫరా చేశారా అన్న అంశాలపై విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

తాగునీరు అనుకుని దోమల మందు తాగి..

అస్వస్థతకు గురైన పారిశుద్ధ్య కార్మికురాలు

కొత్తగూడెంఅర్బన్: తాగునీరు అనుకుని దోమల నివారణకు వినియోగించే మందును తాగిన పారిశుద్ధ్య కార్మికురాలు అస్వస్థతకు గురైంది. వివరాలిలా ఉన్నాయి.. 8వ వార్డులో పారిశుద్ధ్య కాంట్రాక్టు కార్మికురాలిగా పనిచేస్తున్న ఓదమ్మ.. శుక్రవారం విధులు నిర్వహిస్తున్న క్రమంలో దాహం వేయడంతో మంచినీళ్ల బాటిల్ అనుకొని, మలాథియాన్ ద్రవం ఉన్న బాటిల్ తీసుకొని తాగింది. దీంతో గొంతులోకి కొంత వెళ్లగా మిగిలిన ద్రవాన్ని ఉమ్మివేసింది. విషయాన్ని తనతో పాటు పని చేస్తున్న తోటి కార్మికులకు తెలుపడంతో ఆమెను వెంటనే కొత్తగూడెం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఓదమ్మ పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. కాగా, ఓదమ్మను మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కమిషనర్ శేషాంజన్‌స్వామి పరామర్శించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ఠ	కనిష్ఠ
పెసలు	7,875	6,300
మిర్చి	17,250	9,000
మిర్చి తాలు	9,000	9,000
ఏసీ మిర్చి	19,500	10,000
ఏసీ తాలు	9,500	8,000
పత్తి	7,225	5,300

– ఖమ్మం వ్యవసాయం

ఖజానా కళకళలాడేలా..

- ఆదాయం పెంపుపై ఆర్టీసీ ప్రత్యేక దృష్టి
- శ్రావణమాసంలో అద్దె ప్రాతిపదికన బస్సులు
- శుభకార్యాలు, విహార యాత్రలకు రెడీ
- చార్జీలు, సౌకర్యాలపై జిల్లావ్యాప్తంగా అవగాహన



ఖమ్మంమయూరిసెంటర్: ఆదాయం వచ్చే ఏ మార్గాన్నీ వదులుకోకుండా ఆర్టీసీ యాజమాన్యం, అధికారులు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా శ్రావణమాసంలో పెద్దసంఖ్యలో శుభకార్యాలు ఉండటం.. పుణ్యక్షేత్రాల యాత్రలకు కొందరు వెళ్లనున్న నేపథ్యాన బస్సులను అద్దెకు ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించింది. వినియోగదారుల సంఖ్య.. వారి అవసరాలను వెల్లడిస్తే చాలు అందుబాటులో ధరల్లో బస్సులు అద్దెకు ఇవ్వనుండగా.. ప్రైవేట్ బస్సులతో పోలిస్తే నిపుణులైన డ్రైవర్లు ఉన్న విషయమై అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

ఏ బస్సు కావాలి?

ప్రయాణికులు ఎంచుకునే బస్సు ఆధారంగా అధికారులు చార్జీ వసూలు చేయనున్నారు. ప్రయాణ దూరం, ప్రయాణానికి పట్టిన సమయం ఆధారంగా అద్దె లెక్కిస్తారు. నాన్ ఏసీ బస్సులన్నింటికీ రన్నింగ్ సమయం గంటకు 30 కి.మీ. చొప్పున, ఏసీ బస్సుల రన్నింగ్ టైమ్ గంటకు 40 కిలోమీటర్ల చొప్పున లెక్కించనున్నారు. ఈ బస్సులకు ఎలాంటి డిపాజిట్ లేకపోగా.. అదనంగా పర్మిట్ ఫీజు, సర్వీస్ చార్జ్, టోల్ చార్జ్‌తో పాటు ఆరు శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ, రాజధాని ఏసీ, గరుడ ప్లస్ ఏసీ బస్సులను అద్దెకు ఇస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఆర్టీసీలో సుశిక్షితులైన డ్రైవర్లు ఉండటం వల్ల శుభకార్యాలు, విహార యాత్రలకు క్షేమంగా వెళ్లిరావచ్చని చెబుతున్నారు.

డిపోల వారీగా సంప్రదించాల్సిన సెల్ నంబర్లు

డిపో	నంబర్
ఖమ్మం	99592 25958
మధిర	99592 25961
సత్తుపల్లి	99592 25962
భద్రాచలం	99592 25960
కొత్తగూడెం	99592 25959
మణుగూరు	99592 25963

అద్దె బస్సులకు సంబంధించి ప్రయాణికులు, చార్జీల వివరాలు

బస్సు	ప్రయాణికుల సంఖ్య	చార్జీ(కి.మీ.కు) రూ.ల్లో	కనీస దూరం (కి.మీ)
మినీ పల్లెవెలుగు	31	41	200
పల్లెవెలుగు	55	68	200
ఎక్స్‌ప్రెస్	50	69	200
డీలక్స్	40	65	200
సూపర్ లగ్జరీ	36	65	300
డీలక్స్	48	77	300
(రాజధాని కన్వర్షన్)			
రాజధాని	40	84	400
గరుడ ప్లస్	49	119	400

కోరిన బస్సు అద్దెకు ఇస్తాం..



వివాహాది శుభకార్యాలు, పుణ్యక్షేత్రాలు, విహార యాత్రలకు వెళ్లే వారు సురక్షితంగా తిరిగొచ్చేలా ఆర్టీసీ తోడుంటుంది. ఆర్టీసీ బస్సుల్లో తక్కువ ఖర్చుతో సురక్షిత ప్రయాణం చేసే వీలుంది. అటు ప్రయాణికులకు అందుబాటులో ఉండటమే కాక ఆర్టీసీకి ఆదాయం వచ్చేలా బస్సులను అద్దెకు ఇవ్వాలని నిర్ణయించాం. ప్రయాణికులు వారు వెళ్లి రావాల్సిన దూరం, ఆశించే సౌకర్యాల ఆధారంగా ఏ బస్సయినా ఎంచుకోవచ్చు. రీజియన్‌లోని ఏ డిపో నుంచి అయినా బస్సులు అద్దెకు అందుబాటులో ఉంటాయి. సుశిక్షతులే కాక సీనియర్లు డ్రైవర్‌గా ఉన్నందున ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎ.సరిరామ్, ఖమ్మం రీజినల్ మేనేజర్

పరిసరాలు, వీధుల పరిశుభ్రత తప్పనిసరి

- పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయం
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ఆదివాసీ దినోత్సవంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న డీడీ విజయలక్ష్మి

ఖమ్మంమయూరిసెంటర్: ఇంట్లోనే కాకుండా పరిసరాలు, వీధుల పరిశుభ్రతపై అందరూ దృష్టి సారించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని ఖమ్మం ఎఫ్‌సీఐ రోడ్డు, సారథినగర్ ప్రాంతాల్లో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశుభ్రత, డ్రైడేపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఆతర్వాత చెత్త సేకరణను పరిశీలించిన కలెక్టర్ అటు స్థానికులు, ఇటు కార్మికులకు సూచనలు చేశారు. చెత్త సేకరించే సమయంలో తడి, పొడి చెత్త వేర్వేరుగా తీసుకుంటే ఇబ్బంది ఉండదని తెలిపారు. అలాగే, తాగునీటి సరఫరా, చెత్త సేకరణ, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, ఆశా సిబ్బంది విధులపై ఆరా తీశారు. కాగా, నగరాన్ని అందంగా ఉంచేందుకు పాటుపడుతున్న మున్సిపల్ కార్మికులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించిన కలెక్టర్.. వారి సేవలను అభినందించారు. కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ ఏ.సంపత్‌కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పెవిలియన్ మైదానం నుండి జెడ్పీ సెంటర్ వరకు సాగిన ఆదివాసీ విద్యార్థుల ర్యాలీని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రారంభించి మాట్లాడారు. భవిష్యత్‌ను తీర్చిదిద్దేది చదువేనని గుర్తించి శ్రద్ధ వహించాలని సూచించారు. ఆదివాసీ సంప్రదాయాల నుంచి నేర్చుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. ఆతర్వాత గిరిజన భవనంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి విజయలక్ష్మి జెండా ఆవిష్కరణ చేసి.. కొమురం భీమ్, ఆదివాసీ నాయకుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. గిరిజన సంక్షేమ శాఖ ఏఓ నారాయణరెడ్డి, ఏటీడీఓ జహీరుద్దీన్, ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.

‘సీతారామ’ ప్రారంభం పేరుతో మోసం



బీజీ కొత్తూరు వద్ద ప్రాజెక్ట్ మ్యాప్‌లు పరిశీలిస్తున్న నాయకులు

అశ్వాపురం: మండలంలోని కుమ్మరిగూడెం వద్ద సీతమ్మ సాగర్ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం సీతారామ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం పేరుతో జిల్లా రైతులను మోసం చేస్తోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసాని ఐలయ్య అన్నారు. మండలంలోని బీజీకొత్తూరులోని సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్‌ను, కెనాల్ పనులను సీపీఎం నాయకుల బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఐలయ్య విలేకరులతో మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టును గోదావరి బ్యాక్ వాటర్‌తో నిర్మించాల్సిందని, ప్రాజెక్ట్ ఇంకా పూర్తి కాలేదని, దీంతో గోదావరి బ్యాక్ వాటర్ వచ్చే అవకాశం లేదన్నారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ పనులు మధ్యలోనే నిలిచిపోయాయని, పైగా ఆ ప్రాజెక్ట్ కింది భాగంలో కెనాల్ నిర్మించారని, లాక్‌లు కూడా ఏర్పాటు చేయలేదన్నారు. కేవలం వర్షపునీటితో సీతారామ ప్రాజెక్టును ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధపడిందని విమర్శించారు. రెండో పంప్‌హౌస్‌ను ముఖ్యమంత్రి ఈ నెల 15న ప్రారంభిస్తారని ప్రకటించి అక్కడ వర్షపు నీరు నిల్వ చేశారని, గోదావరి నీరు అక్కడికి రాదని, ఇది జిల్లా ప్రజలను మోసం చేయడమేనని మండిపడ్డారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ పూర్తి చేసి మూడున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించి మిగిలిన జలాలు ఇతర ప్రాంతాలకు తరలించాలని, లేనిపక్షంలో రైతాంగాన్ని సమీకరించి నీటి విడుదలను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యలమంచిలి వంశీకృష్ణ, అన్నవరపు సత్యనారాయణ, సహాయ కార్యదర్శి కొండబోయిన వెంకటేశ్వర్లు, సాంబశివరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల శ్రీనివాసరావు, నాయకులు స్వర్ణం బాలనర్సయ్య, నెల్లూరు నాగేశ్వరరావు, మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, పాయం నరసింహారావు, భద్రయ్య, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

నాటక రంగానికి ఊపిరి అభినందనీయం

రెండు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీల్లో వక్తలు



పోటీలను ప్రారంభిస్తున్న నెలనెలా వెన్నెల నిర్వాహకులు



మూల్యం నాటికలో ఓ సన్నివేశం

ఖమ్మంగాంధీచౌక్: నానాటికీ కనుమరుగవుతున్న నాటక రంగానికి ఊపిరి పోసేలా నెలనెలా వెన్నెల పేరుతో ప్రదర్శనలు ఇస్తుండడం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో శుక్రవారం రాత్రి తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు ప్రారంభమయ్యాయి. నెలనెలా వెన్నెల 7వ వార్షికోత్సవం సందర్భంగా ఈ పోటీలను ఏర్పాటుచేయగా పలువురు మాట్లాడారు. ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో నెలనెలా వెన్నెలకు ఎంతో ఆదరణ ఉందని, వివిధ ప్రాంతాల కళాబృందాలు ఇక్కడ ప్రదర్శన ఇచ్చేందుకు ఆసక్తి చూపడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం మూడు రోజుల పాటు పోటీలు నిర్వహిస్తుండడంతో కళాకారులకు ఆదరణ లభిస్తుందని చెప్పారు. అనంతరం ఖమ్మం కళా పరిషత్ గౌరవ అధ్యక్షుడు వీ.వీ.అప్పారావును స్తంభాద్రి అవార్డుతో సత్కరించారు. ఖమ్మం కళా పరిషత్ గౌరవ అధ్యక్షుడు నాగబత్తిని రవి, అమరజీవి అన్నబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, ఏ.సుబ్రహ్మణ్యకుమార్, పుతుంబాక కృష్ణప్రసాద్, బయ్యన బాబు, వేల్పుల విజేత, బీ పుష్పరాణి, మిత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు కురువెళ్ల ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నాటికలు

పోటీల్లో భాగంగా తొలిరోజు ప్రదర్శించిన మూడు నాటికలు అలరించాయి. మనిషికి కష్టం కలిగితే నా రాత ఇంతే అని బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న పలువురిపై రూపొందించిన ‘రాత’ నాటికను కృష్ణా జిల్లా వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ బృందం ప్రదర్శించింది. ఆడపిల్లలపై అడుగడుగునా జరుగుతున్న ఆంక్షలపై హైదరాబాద్ గోవాడ క్రియేషన్స్ బృందం ‘మూల్యం’, వీరన్నపాలెం కళానికేతన్ కళాకారులు ‘రాజుగారి గోచి’ నాటికను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలను వీక్షించిన ప్రేక్షకులు కళాకారులతో పాటు నిర్వాహకులను అభినందించారు.

కిన్నెరసాని గేటు ఎత్తివేత

పాల్వంచరూరల్: ఎగువన కురుస్తున్న వర్షాలకు కిన్నెరసాని జలాశయంలోకి వరదనీరు వచ్చి చేరుతోంది. 407 అడుగుల నీటి నిల్వసామర్థ్యం కలిగిన కిన్నెరసాని రిజర్వాయర్‌లోకి ఎగువనుంచి 2,800 క్యూసెక్కుల వరదనీరు రావడంతో శుక్రవారం నీటి మట్టం 405.80 అడుగులకు పెరిగింది. దీంతో ప్రాజెక్టుకు చెందిన ఒక గేటును రాత్రి ఎత్తివేసి 5 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

బాలికను వివాహం చేసుకున్న యువకుడిపై కేసు

మధిర: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను వివాహం చేసుకున్న యువకుడిపై కేసు నమోదైంది. సదరు బాలికను తీసుకెళ్లిన కొత్రపాటి షద్రవు జూన్ 20న వివాహం చేసుకున్నాడు. ఈవిషయమై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతికుమారి ఇచ్చిన ఫిర్యాదుతో గురువారం మధిర టౌన్ పోలీసులు కేసు నమోదు నమోదు చేశారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



కార్మికులతో మాట్లాడుతున్న రాసూరి శంకర్

సత్తుపల్లిరూరల్: సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాసూరి శంకర్ తెలిపారు. సత్తుపల్లి జేవీఆర్ ఓసీ వద్ద శుక్రవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులందరికీ జీఓ 22 వర్తింపచేసేలా ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. అలాగే, సింగరేణి పాఠశాలల్లో కాంట్రాక్టు కార్మికుల పిల్లలకూ ఉచిత విద్య వర్తింపచేయాలని, పనివేళలు పాటించాలనే డిమాండ్‌తో కోర్టులో కేసు వేసినట్లు చెప్పారు. అనంతరం సంఘం సత్తుపల్లి యూనిట్ బాధ్యులుగా షేక్ నాగుల్ మీరా, శారమ్మను ఎన్నుకున్నారు. ఈసమావేశంలో నాయకులు గూడలి యాకయ్య, బాషా, బోయిన రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసు నమోదు

మధిర: మధరలోని ఓ బార్ వద్ద ఏర్పాటుచేసిన బడ్డీషాపులో చోరీ జరగగా యజమాని షేక్ సకినా ఇచ్చినఫిర్యాదుతో మధిర టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని జిలుగుమాడుకు చెందిన ఆమె బార్ వద్ద బడ్డీ కొట్టును ఈనెల 6న రాత్రి మూసేసి వెళ్లగా మరుసటి రోజు ఉదయం వచ్చేసరికి షాపు పగలగొట్టి ఉంది. దీంతో పరిశీలించగా నగదు, సామగ్రి కలిపి రూ.10,760 మేర చోరీ కావడంతో గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మిరప నారుమడిపై విష ప్రయోగం

కన్నీరుమున్నీరైన రైతు కుటుంబం



మాడిపోయిన నారు వద్ద విలపిస్తున్న రైతు కుటుంబం

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడులో మిరప నారుమడిపై గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేయగా నారు పూర్తిగా మాడిపోయింది. గ్రామానికి చెందిన రైతు కేలోత్ చంద్రం – లలిత మిరప సాగు చేసేందుకు పొలంలోనే నారు పోశారు. పదిరోజుల్లో నాటాలని భావిస్తుండగా ఏపుగా పెరిగిన నారుపై గుర్తు తెలియని వ్యక్తులు కలుపు మందు చల్లినట్లు భావిస్తుండగా శుక్రవారం పూర్తిగా మాడిపోయింది. దీంతో బాధిత రైతు కుటుంబం కన్నీరుగా విలపిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆటోల చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడు, ఆటోలతో పోలీసులు

ఖమ్మంక్రైం: పార్కింగ్ చేసి ఉన్న ఆటోలను చోరీ చేస్తున్న వ్యక్తిని ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాలు... ఖమ్మం రూరల్ మండలం గుదిమళ్లకు చెందిన గోసుల వెంకన్న మద్యంతో పాటు చెడు వ్యసనాలకు బానిసై డబ్బు కోసం ఆటోల చోరీ మొదలుపెట్టాడు. 2023లో సూర్యాపేటలో ఆటోను దొంగిలించిన ఆయన ఆరు జైలు శిక్ష అనుభవించాడు. ఆతర్వాత స్వగ్రామంలో సుతారీ పనిచేస్తున్నా డబ్బు సరిపోక మళ్లీ చోరీల బాటపట్టాడు. ఈనెల 6వ తేదీన ఖమ్మం వచ్చిన ఆయన తన గ్రామానికే వ్యక్తి పాలు పోసేందుకు వచ్చి కిందకు దిగగానే ఆటో ఎత్తుకెళ్లాడు. అదే రోజు సాయంత్రం పాత బస్టాండ్ సమీపాన మరో ఆటోను చోరీ చేశాడు. పాత బస్టాండ్ వద్ద శుక్రవారం వద్ద ఆటోతో అనుమానాస్పదంగా కనిపించిన వెంకన్నను అదుపులోకి తీసుకుని విచారించగా విషయం బయటపడడంతో రెండు ఆటోలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల పేరిట బెదిరించిన నలుగురిపై కేసు

ఖమ్మంఅర్బన్: ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల పేరిట శుక్రవారం ఖమ్మంలో కొందరు హల్‌చల్ చేశారు. నగరంలోని మమత ఆస్పత్రి రోడ్డులోని కింగ్ దర్బార్ హోటల్లోకి ప్రవేశించి లోపాలు ఉన్నాయని బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేశారు. దీంతో అనుమానం వచ్చిన హోటల్ యజమాని అసలు ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం ఇవ్వడంతో విషయం బయటపడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన గుగులోతు మోహన్‌రావు, బానోతు రామస్వామి, సపావత్ యువరాజ్, అజ్మీరా యువరాజుసింగ్ శుక్రవారం కింగ్ దర్బార్ హోటల్‌కు వచ్చి ఫుడ్ ఇన్‌స్పెక్టర్లుగా పరిచయం చేసుకున్నారు. ఆపై సరుకులు, ఆహార పదార్థాలను తనిఖీ చేసి యజమానిని బెదిరిస్తూ డబ్బు డిమాండ్ చేశారు. దీంతో హోటల్ యజమాని ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చేలోగా నకిలీలు పారిపోయారు. అనంతరం ఘటనపై యజమాని ఇచ్చిన ఫిర్యాదుతో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ (ఖానాపురం హవేలీ) సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

కోతుల దాడిలో ఇద్దరికి గాయాలు

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెంలో శుక్రవారం కోతులు దాడి చేయగా ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన సూదా రంగనాయకమ్మ, రమణ, తోట భద్రమ్మ, కృష్ణకుమారి, నాగమణి, భట్ట మాధవి, గాజుల లక్ష్మీనర్సమ్మ తదితరులు ఆరుబయట ఉండగా కోతుల గుంపు వచ్చింది. ఈక్రమంలో కోతులు దాడి చేయగా రంగనాయకమ్మ, భద్రమ్మకు గాయాలు కావడంతో తల్లాడ ఆస్పత్రికి తరలించారు.

లారీ ఢీకొని వ్యక్తికి..

తల్లాడ: మండలంలోని మంగాపురం క్రాస్ వద్ద శుక్రవారం మోటార్ సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. కొణిజర్ల మండలం దుద్దిపుడికి చెందిన డి.మల్లేష్ తల్లాడ మండలంలోని నారాయణపురం వచ్చి వెళ్తుండగా మంగాపురం క్రాస్ వద్ద లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను 108లో ఖమ్మం తరలించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



భానుచందర్ (ఫైల్)

చింతకాని: విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడిన మండలంలోని మత్కేపల్లికి చెందిన బొలకొండ భానుచందర్(28) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. గ్రామంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న ఆయన ఈనెల 2వ తేదీన విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించగా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. భానుచందర్‌కు భార్య, కుమార్తె ఉన్నారు.

పోలీసుల అదుపులో కీలక మావోయిస్టు ?

- పేలుడు పదార్థాలు సరఫరా చేసినట్టుగా అనుమానం
- విచారణ చేస్తున్న భద్రాద్రి పోలీసులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు పార్టీకి సహకారం అందించే కీలక వ్యక్తి జిల్లా పోలీసుల అదుపులో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. జిల్లాకు చెందిన ఓ వ్యక్తి నాలుగేళ్ల కిందట సీతారామ ఎత్తిపోతల పథకం నిర్మాణం, భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణ పనుల్లో భారీ యంత్రాల డ్రైవర్‌గా పని చేశారు. గోదావరి తీరంలో పని చేస్తున్న సమయాన మావోయిస్టు పార్టీ విధానాలకు ఆకర్షితుడై ఆ పార్టీకి సానుభూతిపరుడిగా మారినట్టు తెలుస్తోంది. అజ్ఞాతంలోకి వెళ్లకుండా సామాన్య పౌరుడిగా ఉంటూ అవసరమైనప్పుడు మావోలకు సహాయపడుతుండేవాడని చెబుతున్నారు. రెండు వారాల క్రితం ఏపీ – కర్ణాటక సరిహద్దులో ఐరన్ ఓర్ క్వారీలు ఎక్కువగా ఉండే ప్రాంతంలో సదరు వ్యక్తి సంచరిస్తుండగా అనంతపురం జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రాథమిక విచారణలో పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో అప్రమత్తమైన అనంతపురం పోలీసులు భద్రాద్రి జిల్లా పోలీసులకు సమాచారం ఇచ్చినట్టు సమచారం. దీంతో సదరు వ్యక్తిని జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్టు తెలుస్తోంది. సదరు వ్యక్తి మావోయిస్టులకు పేలుడు పదార్థాలు సరఫరా చేయడంలో సాయం అందిస్తున్నట్టుగా గుర్తించినట్లు ప్రచారం జరుగుతోంది. గత వేసవిలో పోలీసులు, భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకుని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన పలు పేలుళ్ల వెనుక ఎవరెవరి పాత్ర ఉందనే అంశంపై అదుపులో ఉన్న వ్యక్తి నుంచి మరింత సమాచారం సేకరించే పనిలో పోలీసు వర్గాలు ఉన్నట్లు తెలుస్తోంది.